# బలహీనతలు కొనసాగొచ్చు




**సెన్సెక్స్ విశ్లేషణ**

**డిసెంబరు 16తో ముగిసిన వారానికి**

**సమీక్ష** : స్టాక్ మార్కెట్లో విక్రయాల ఒత్తిడి కొనసాగింది. అంచనాల కన్నా దిగువన వెలువడ్డ ఆర్థిక గణాంకాలు, రూపాయి మారక క్షీణత, ఎఫ్ఐఐల విక్రయాలు, యూరోజోన్ సంక్షోభాలు ఇందుకు కారణాలయ్యాయి. దీంతో మార్కెట్ రెండేళ్ల కనిష్ఠ స్థాయికి దిగజారింది. దేశీయ మార్కెట్లు లాభాలతోనే ప్రారంభమైనా పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ) అక్టోబరు గణాంకాలు - 5.1 శాతంగా నమోదవడంతో తీవ్ర విక్రయాల ఒత్తిడి ఎదురైంది. ఆ తరువాత రూపాయి మారక విలువ క్షీణత, అంచనాలకు దూరంగా వెలువడ్డ ద్రవ్యోల్బణ గణాంకాలు కలిసి మార్కెట్ సెంటిమెంటును దెబ్బతీశాయి. ఆహార ద్రవ్యోల్బణం, ముందస్తు పన్ను గణాంకాలు కొంత మద్దతును ఇచ్చాయి. శుక్రవారం పరపతి విధాన సమీక్షలో కీలక రేట్ల పెంపునకు విరామం ఇచ్చినా, బ్యాంకుల వద్ద సర్దుబాటు నిధులు సరిపడా లేవన్న ఆర్‌బీఐ వ్యాఖ్యల మధ్య లాభాల స్వీకరణ జరిగింది. శుక్రవారం సెన్సెక్స్ ఒక దశలో రెండేళ్ల కనిష్ఠ స్థాయి 15425కు కుంగింది. చివరకు 722 పాయింట్ల నష్టంతో 15491 వద్ద ముగిసింది.

**ఎఫ్ఐఐల తీరు** ప్రతికూల అంతర్జాతీయ పవనాల మధ్య ఎఫ్ఐఐలు రూ.1,383.20 కోట్ల నికర విక్రయాలు జరపగా.. రూ.208 కోట్ల నికర అమ్మకాలు చేశాయి.

**రంగాల వారీగా** యంత్ర పరికరాలు, మన్నికైన వినిమయ వస్తువులు, స్థిరాస్తి సూచీలు నష్టాల్లో ట్రేడయ్యాయి. స్థిరాస్తి సూచీ ఎక్కువ నష్టపోయింది. బ్యాంకుల సర్దుబాటు నిధులు తక్కువగా ఉన్నాయన్న ఆర్‌బీఐ ఆందోళనల కారణంగా బ్యాంకింగ్ సూచీ దెబ్బతింది. రూపాయి మారక విలువ క్షీణించడంతో ఐటీ స్క్రిప్‌లకు మద్దతు లభించింది. రక్షణాత్మక రంగమైన ఎఫ్ఎమ్‌సీజీ షేర్లు కూడా రాణించాయి.

**శుక్రవారం లాభపడ్డ, నష్టపోయిన షేర్ల నిష్పత్తి 1:2గా నమోదవడం..**

**స్థానిక మార్కెట్లలో విక్రయాల ఒత్తిళ్లను సూచిస్తోంది.**

**భవిష్యత్ అంచనా** కీలక మద్దతు స్థాయిలను కోల్పోతూ శుక్రవారం సెన్సెక్స్ ఒక దశలో 25 వారాల కనిష్ఠ స్థాయి 15,425ని తాకింది. ఈ పరిణామం 14,400 వరకూ దిద్దుబాటు అయ్యే అవకాశాలను సూచిస్తోంది. కేవలం 16,297 స్థాయి పైన ముగిస్తేనే స్వల్పకాలంలో మార్కెట్లో ర్యాలీ చూడవచ్చు.

**ప్రభావిత అంశాలు** రుణ సంక్షోభం ఇంకా పరిష్కారం కాని నేపథ్యంలో యూరోజోన్ పరిణామాలను మన మార్కెట్లు సునిశితంగా గమనించవచ్చు. ఆర్‌బీఐ చొరవతో కాస్త రికవరీ అయిన రూపాయి విలువ మరింత బలపడితే చమురు, తదితర దిగుమతి ఆధారిత రంగాలకు ఊరట కలగవచ్చు. ఆహార ద్రవ్యోల్బణం ఇంకా దిగువకు వస్తే సెంటిమెంటు మెరుగు పడవచ్చు. చమురు ధరలు, కొనసాగుతున్న ఎఫ్ఐఐల విక్రయాలు మార్కెట్‌పై ప్రభావాన్ని చూపవచ్చు.

**తక్షణ నిరోధ స్థాయిలు: 15772; 16069; 16142 తక్షణ మద్దతు స్థాయిలు: 15208, 14956, 14684**

**స్వల్పకాలంలో మార్కెట్లో బలహీనతలు కొనసాగవచ్చు.**

*– సతీశ్ కంతేటి, జెన్‌మనీ*